క్లుప్తంగా

తుంగెడలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రెబ్బెన: మండలంలోని తుంగెడలో గురువారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పూదరి హరీశ్, పంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ, పీహెచ్‌సీ సిబ్బంది ప్రవీణ్, గ్లోరీ సుజన, రుచిత, తులసి, వినోద పాల్గొన్నారు.

సీఐని కలిసిన బీజేపీ నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ పట్టణ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన బుద్దె రవీందర్‌ను గురువారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మాటూరి జయరాజ్, సంతోష్, సోమ, శ్రీను, కార్తీక్, రాజేష్ పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకొని పీఆర్టీయూ సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించాలని పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉప్పుల నరసింహచారి కోరారు. గురువారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంఘం నాయకులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమన్నారు. సీపీఎస్ రద్దు కోసం బలమైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గావుడే హన్మంతు, రాజు, గణపతి, మార్త రమేశ్, హెచ్‌ఎం నారాయణ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి



విద్యార్థులను చదివిస్తున్న ఎంఈవో

కెరమెరి: విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఆడే ప్రకాశ్, ఎంపీడీవో అంజద్ పాషా అన్నారు. గురువారం వారు మండలంలోని చింతకర్ర, శంకర్‌గూడ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులతో చదవించి, బోర్డుపై రాయించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులు రాస్తున్న ఎస్‌ఏ–1 పరీక్షలను పరిశీలించారు. తప్పకుండా మెనూ పాటించాలని సూచించారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

కౌటాల: పశువులకు రైతులు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి ఎస్ శ్రీకాంత్ అన్నారు. గురువారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా టీకాల కార్యక్రమం చేపడుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చరందాస్, సిబ్బంది సత్యనారాయణ, శోభన్, భిక్షపతి, ప్రకాశ్ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం వద్ద అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా దిందా గ్రామానికి చెందిన దుర్గం బాపు గుడుంబా తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడి వద్ద 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. గ్రామాల్లో గుడుంబా అమ్మితే సమాచారం ఇవ్వాలన్నారు.

సన్నాలకు తెగుళ్లు..!

- పురుగు ఉధృతితో దెబ్బతింటున్న వరి
- మందుల పిచికారీతో కుదేలవుతున్న రైతులు



పుంజుమేర గూడ సమీపంలో సాగు చేస్తున్న వరి

రెబ్బెన: ఈసారి సన్నరకం వరి పంటలకు తెగుళ్లు ఆశిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దొడ్డురకం వరితో పోల్చితే సన్నరకం వరికి తెగుళ్లు, పురుగు ఉధృతి అధికంగా ఉంది. దీంతో పంట దిగుబడిపై ప్రభావం పడుతుందని వాపోతున్నారు. చేతికి అందిన పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. తెగుళ్లు, పురుగును నివారించేందుకు క్రిమిసంహారక మందుల పిచికారీ చేస్తున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం పెరగడంతో పాటు విపరీతమైన పురుగు మందుల పిచికారీతో పర్యావరణం సైతం దెబ్బతింటోంది.

చేతికి అందే దశలో..

మండలంలో అధిక శాతం రైతులు పత్తి సాగుకే మొగ్గు చూపుతున్నారు. బోరు మోటార్లు, వాగు సమీప ప్రాంతాల రైతులు, చెరువులు కుంటల కింద ఈసారి రైతులు సుమారు 6 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా.. 95 శాతం మంది రైతులు సన్న రకాలనే సాగు చేశారు. బోరుమోటార్ల కింద ముందస్తుగా సాగు చేసిన పంటలు కోత దశకు చేరుకోగా.. అధిక శాతం పంటలన్నీ పొట్ట, వరి గొలకలు దశలో ఉన్నాయి. ఈ సమయంలోనే వరికి తెగుళ్లు, పురుగు ఉధృతి పెరిగింది. మొగి పురుగులు, రెక్కల పురుగు ఉధృతి ఉండడంతో పంటలు దెబ్బతింటున్నాయి. దీనికి తోడు అగ్గితెగుళ్లు, కాటుక తెగుళ్లతో పాటు ఇతర తెగుళ్ల సోకి పంటలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి.

పెరుగుతున్న పెట్టుబడి..

ప్రస్తుతం వరి సాగులో పెట్టుబడులు ఎక్కువ లాభాలు తక్కువ అన్నట్లుగా మారింది. పెరిగిన కూలీల రేట్లు, ఎరువులు ధరలకు తోడు తెగుళ్ల నివారణకు క్రిమి సంహారక మందుల పిచికారీతో పెట్టుబడులు గణనీయంగా పెరుగుతున్నాయి. క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేందుకు కూలీలు రోజుకు రూ. 800 వరకు తీసుకుంటున్నారు. గతంలో వరికి రెండుసార్లు మాత్రమే పురుగు మందును పిచికారీ చేసేవాళ్లు. కానీ ప్రస్తుతం నాలుగైదు సార్లు పిచికారీ చేసినా.. తెగుళ్ల ఉధృతి తగ్గడం లేదని రైతులు వాపోతున్నారు.

పురుగు ఉధృతి ఉంది

మండలంలో సాగు అవుతున్న వరిలో జైశ్రీరాం వంటి సన్నరకం వరిలో పురుగు ఉధృతి ఉంది. ప్రస్తుతం పొట్ట దశ నుంచి వరి గొలుసు బయటకు వచ్చే దశకు చేరుకున్నాయి. ఈ సమయంలో పురుగు ఉధృతి ఉంటుంది. సకాలంలో మందులు పిచికారీ చేయకుంటే దిగుబడిపై ప్రభావం చూపుతోంది. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు మందులు పిచికారీ చేస్తే ఆశించిన స్థాయిలో దిగుబడి సాధించవచ్చు.

– సంజీవ్ ఏఈవో

ఏరులై పారుతున్న గుడుంబా



గుడుంబా నిషేధించాలని ఎస్సైకి వినతిపత్రం అందజేస్తున్న ఎలుకపెల్లి గ్రామస్తులు (ఫైల్)

- గ్రామాల్లో 24 గంటలపాటు లభ్యం
- మత్తుకు బానిసవుతున్న యువత
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

బెజ్జూర్: ఎంత రాత్రి అయినా సరే తలుపులు తడితే.. చాలు గుడుంబా సీసా చేతిలోకి వస్తోంది. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొందరైతే నిద్ర లేవగానే నేరుగా బెల్టుషాపులు, గుడుంబా విక్రయించే షాపులకే వెళ్తున్నారు. కిక్కు లేనిదే పనికి కూడా వెళ్లలేని పరిస్థితి దాపురించింది. కనీసం వెయ్యి జనాభా లేకున్నా పల్లెల్లో 100 నుంచి 200 గృహాలు ఉన్న చోట 10 నుంచి 15 బెల్ట్ షాపులు నడుస్తున్నాయంటే పోటీ తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మద్యానికి బానిసైన యువకులు ఇంట్లో గొడవలకు దిగడం, తాగడానికి డబ్బులు ఇవ్వమని వేధించడం, మత్తులో పురుగుల మందు సేవించిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

కన్నెత్తి చూడని అధికారులు..

మండలంలోని ఎలుకపెల్లి, చిన్న సిద్దాపూర్, మర్థిడి గ్రామాలకు చెందిన యువకులు, పెద్దలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తమ గ్రామాల్లో గుడుంబా నిషేధం చేయాలని, మద్యం అసలే నడపకూడదని పేర్కొన్నారు. మద్యానికి బానిసై యువత చెడు వ్యసనాలకు పాల్పడుతున్నారని వాపోయారు. మత్తులో తూగుతూ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. పలు సందర్భాల్లో అధికారులకు వినతి పత్రాలు సైతం సమర్పించారు. అయినప్పటికీ అధికారులు కనీసం స్పందించడం లేదని చెబుతున్నారు. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కుటుంబాలు చిన్నాభిన్నం..

ప్రతీనెల ఓ వ్యక్తి మద్యానికి బానిసై పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకుంటున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా యువత మద్యానికి బానిసై విలువలైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. దీంతో ఆ కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం గుడుంబా కట్టడిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

గుడుంబా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ గుడుంబా విక్రయదారులను తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేస్తున్నాం. గత వారం రోజుల క్రితం బెజ్జూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో ఏడుగురిని బైండోవర్ చేశాం.

– రవికుమార్, ఎక్సైజ్ సీఐ

గ్రంథాలయం సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్

రెబ్బెన: రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన మోడల్ గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వెంకటేశ్వర్ అన్నారు. మండలంలోని వంకులం ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ గ్రంథాలయాన్ని ఎంఈవో ప్రారంభించారు. పుస్తక పఠనం ద్వారా పిల్లలకు ఆలోచన, ఊహాశక్తి పెరుగుతుందన్నారు. సుమారు 700 పుస్తకాలు అందుబాటులో ఉండటంతో పాటు పుస్తకాలు చదివేందుకు వీలుగా రీడింగ్ టేబుల్స్, పుస్తకాలను భద్రపర్చేందుకు బీరువా, చిత్రాలు వేయడానికి సామగ్రి అందుబాటులో ఉన్నాయన్నారు. హెచ్‌ఎంలు ప్రభాకర్, విజయరాణి, మహేశ్వర్, పురుషోత్తం, వినయ్‌కుమార్, లతీఫ్, ఎస్‌వోటూ శ్రీనివాస్, సీఆర్పీలు దేవేందర్, రాజేష్, మహేశ్వర్ పాల్గొన్నారు.

గ్యాస్ లీకై ఇల్లు దగ్ధం



పరిశీలిస్తున్న తహసీల్దార్ భూమేశ్వర్

బెజ్జూర్: మండల కేంద్రంలోని బెస్తవాడకు చెందిన కంపెనీ వెంకటేశ్ ఇంట్లో గురువారం గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బయటికి వెళ్లి కేకలు వేయడంతో చుట్టూ పక్కల వారు బోరు మోటర్లతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అంతలోనే గ్యాస్ మంటలు వ్యాపించి ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. ఇంట్లోని నిత్యావసరాలు, వస్తు సామగ్రి కాలిపోయింది. ఈ ఘటనలో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ భూమేశ్వర్ ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ఆయన వెంట ఆర్‌ఐ అచ్యుతరావు, జూనియర్ అసిస్టెంట్ జావిద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పెసా చట్టాన్ని గౌరవించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఐదో షెడ్యూల్డ్ ప్రకారం పెసా చట్టం అమలులో ఉన్నందున వలస గిరిజనేతరులకు ఇల్లు కట్టుకునే అవకాశం ఇవ్వవద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు డిమాండ్ చేశారు. గురువారం సంఘ నాయకులతో కలిసి ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీ అమృత్‌లాలకు, ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెసా చట్టంతో పాటు గిరిజన ప్రాంతంలోని భూ బదలాయింపు నిషేధ చట్టం అమలులో ఉన్నందున 1970 తర్వాత వచ్చిన వారికి ఎలాంటి నిర్మాణాలకు అవకాశం ఇవ్వొద్దని కోరారు. కార్యక్రమంలో ఉమేశ్, రమేశ్, శంభు, దేవ్‌రావు, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

నార్నూర్: మండల కేంద్రంలోని ఉప మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మాన్కాపూర్‌లో రైతులతో సమావేశం అయ్యారు. నార్నూర్, గాదిగూడ ఉమ్మడి మండలంలో రైతులు అత్యధికంగా మొక్కజొన్న సాగు చేయడం జరిగిందని అన్నారు. పంట చేతికి రావడంతో గోదాంలు లేక ఆరుబయటే పెట్టాల్సి వస్తోందన్నారు. మార్క్‌ఫెడ్, సహకార సంఘం ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



సీఐ రాజేంద్రప్రసాద్

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణ సీఐగా రాజేంద్రప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గతంలో పనిచేసిన శంకరయ్య ఐజీ కార్యాలయానికి బదిలీ కాగా, రాజేంద్రప్రసాద్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ రాజేంద్రప్రసాద్‌ను పట్టణ ఎస్సైలు రమేశ్, సుధాకర్, అనిల్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా డీఎస్పీ రామానుజం, అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావును సీఐ రాజేంద్రప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

బారెగూడలో ఈజీఎస్ గ్రామసభ

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని బారెగూడ గ్రామంలో గురువారం ఉపాధి హామీ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో బుచ్చన్న మాట్లాడుతూ ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపట్టబోయే పనుల ఎంపిక కోసం గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి దేవాజీ, టెక్నికల్ అసిస్టెంట్ దేవేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్



2కే రన్ ప్రారంభిస్తున్న ఎస్సై సునీల్

ఇంద్రవెల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం మండల కేంద్రంలో 2కే రన్ నిర్వహించారు. ఎస్సై దుబ్బక సునీల్ ప్రారంభించారు. వివిధ పాఠశాల విద్యార్థులు, మండల కేంద్రంలోని యువకులు, నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్ నుంచి అంజీ చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు ఎస్సై బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ అఫ్జర్, నాయకులు ఎండీ మసుద్, కాంబ్లే బాలాజీ, పరత్‌వాగ్ దత్త, ఆరీఫ్, జోందలే సంజీవ్ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



కౌటాల: మాట్లాడుతున్న పోలీస్ అధికారులు



పెంచికల్‌పేట్: బహుమతులు అందజేస్తున్న ఎస్సై



తిర్యాణి: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కౌటాల: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీఐ ముత్యం రమేశ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కౌటాల ఎస్సై మధుకర్ పోలీస్‌స్టేషన్‌లో ఉండే రిసెప్షన్ వ్యవస్థ, కేసు డైరీలు, ఆయుధాలు, పోలీసుల విధులు, ఖైదీల గదులు, షీటీం, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని సీఐ కార్యాలయాన్ని పరిశీలించారు. ఎక్కడ అన్యాయానికి గురైన పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలకిషన్ రావు, అధ్యాపకులు అశోక్, శ్రీనివాస్‌నాయక్, రాందాస్, మోతిలాల్‌నాయక్, శ్రీవాణి, సుజాత, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెంచికల్‌పేట్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

తిర్యాణి: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్సై మాధవ్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలల్లో భాగంగా గురువారం రాత్రి మండల కేంద్రంలో స్థానిక యువకులతో కలిసి కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా పోలీసులు ఎంతో మంది తమ ప్రాణాలను ఫణంగా పెట్టి దేశానికి రక్షణగా నిలిచారన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా



ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బెజ్జూర్: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కోకన్వీనర్ కొండ రాంప్రసాద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాం రాం అని గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ మాటలను రేవంత్‌రెడ్డి సర్కార్ నిజం చేసిందన్నారు. వానాకాలం పంట సీజన్‌కు రైతుబంధును పూర్తిగా ప్రభుత్వం ఎగ్గొట్టేసిందని పేర్కొన్నారు. చేతగాని తనంతో రైతన్నలను మోసం చేస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వెంటనే రైతుల ఖాతాల్లో రైతుభరోసా వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖాజా మోయినొద్దీన్, షమీ, సుర్ల ఇస్తారి, బాబు, గోలేటి కొండయ్య, కుమ్మరి లక్ష్మణ్, బర్ల దేవయ్య, దుర్గం తిరుపతి, వగాడే రాందాస్, నికడే మోహన్, చిలుక కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా భోగ్ బండారో పూజ



భోగ్ బండారో పూజ చేస్తున్న గ్రామ పెద్దలు

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండ గ్రామంలో గురువారం భోగ్ బండారో మహాపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్ద గుణవంత్ నాయక్ భోగ్ బండారో పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవేంకటేశ్వర స్వామి, హతీరామ్ బాబా మఠాన్ని దర్శించుకుని ఏడు రోజులపాటు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సేవలు చేసిన గ్రామస్తులు తిరిగి గ్రామానికి రావడంతో లంబాడి గిరిజనుల సాంప్రదాయ ప్రకారం భోగ్ బండారో మహాపూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

పాఠశాలను తిరిగి ప్రారంభించండి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీగూడ గ్రామంలో మూతపడిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించాలని గురువారం గ్రామస్తులు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో పవార్ అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 100పైగా దళిత కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, దాదాపు 30 మంది పిల్లలు ఉన్నారన్నారు. గత కొన్ని ఏళ్ల క్రితం అధికారుల తప్పుడు రిపోర్ట్‌ల కారణంగా పాఠశాలను మూసివేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం పాఠశాల లేకపోవడంతో రెండు కిలో మీటరు దూరంలో ఉన్న తండాకు వెళ్లి విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పాఠశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దుర్గే యశ్వంతరావు, దుర్గే గుణవంతరావు, కర్మన్‌కర్ గౌతమ్, కర్మన్‌కర్ బుద్దజీ, మునేశ్వర్ సంతోష్, ఝాడే ఆత్మరామ్, తదితరులు పాల్గొన్నారు.